నమస్తే తెలంగాణ
రంగారెడ్డి
I | హైదరాబాద్, బుధవారం 24 ఏప్రిల్ 2024 | RANGAREDDY




# బీఆర్ఎస్.. సమన్వయ మంత్ర

**లోక్‌సభ ఎన్నికల్లో ఐక్యతతో ముందుకు సాగుతున్న పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మాజీ ఎమ్మెల్యేలు, ముఖ్య నేతలు**

**నియోజకవర్గాల వారీగా కొనసాగుతున్న సమన్వయ సమావేశాలు**

**ఇప్పటికే ప్రజలతో మమేకమై ప్రచారం సాగిస్తున్న గులాబీ శ్రేణులు**

**జనంలో బీఆర్ఎస్‌పై పెరుగుతున్న పాజిటివ్ వేవ్**

**గ్రూపులు, అంతర్గత కుమ్ములాటలతో కాంగ్రెస్, బీజేపీలు సతమతం**

రంగారెడ్డి, ఏప్రిల్ 23(నమస్తే తెలంగాణ) : లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ నేతలు సమన్వయ వ్యూహాన్ని అనుసరిస్తున్నారు. పార్టీ అధిష్టానం పిలుపునిచ్చిన ప్రతి కార్యక్రమంలోనూ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మాజీ ఎమ్మెల్యేలు, ముఖ్య నేతలంతా సమన్వయంతో ముందుకు సాగుతున్నారు. ఫలితంగా.. బీఆర్ఎస్ పార్టీ నిర్వహిస్తున్న సభలు, సమావేశాలు విజయవంతమవుతున్నాయి. కానీ.. కాంగ్రెస్, బీజేపీలది మాత్రం ఇందుకు భిన్నమైన పరిస్థితి. పార్టీలు మారిన నేతలు అభ్యర్థులుగా ఉండడంతో కిందిస్థాయిలో పాత, కొత్త నేతల మధ్య సమన్వయం కొరవడిందని ప్రచారం జరుగుతున్నది. గ్రూపు రాజకీయాలు, అంతర్గత కుమ్ములాటలు రెండు పార్టీలను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి.

## బెంబేలెత్తుతున్న ప్రతిపక్షాలు..

లోక్ సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ వ్యూహ ప్రతి వ్యూహాలకు ప్రతిపక్ష పార్టీలు బెంబేలెత్తుతున్నాయి. ఎన్నికల షెడ్యూల్ కంటే ముందు నుంచే బీఆర్ఎస్ పార్టీ ఎన్నికల క్షేత్రంలో దూసుకుపోతున్నది. పార్టీ అధినేత కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావులు పలు దఫాలుగా చేవెళ్ల లోక్‌సభ స్థానం గెలుపుపై జిల్లాకు చెందిన నేతలు సమీక్ష, సమావేశాలు నిర్వహించి దిశానిర్దేశం చేశారు. మాజీ మంత్రి సబితారెడ్డి నాయకత్వంలో పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మాజీ ఎమ్మెల్యేలు, ముఖ్య నేతలు పకడ్బందీగా కార్యాచరణను రూపొందించుకుని అమలు చేస్తున్నారు. అన్ని స్థాయిల్లోని నేతలు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలను కలుపుకొని ఇప్పటికే ఒక రౌండ్ సమావేశాలను పూర్తి చేశారు. చేవెళ్లలో నిర్వహించిన కేసీఆర్ సభ సైతం సూపర్ సక్సెస్ కావడం పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్తేజాన్ని నింపింది.

ప్రస్తుతం అన్ని నియోజకవర్గాల్లో సమన్వయ కమిటీ సమావేశాలు జరుగుతున్నాయి. అసెంబ్లీ ఎన్నికల ఓటమితో నైరాశ్యంలో ఉన్న క్యాడర్ ప్రస్తుతం సమరోత్సాహంతో ఎన్నికల్లో దూసుకుపోతున్నది. ప్రతిపక్ష పార్టీలు బెంబేలెత్తిపోతున్నాయి. గ్రూపులు, అంతర్గత కుమ్ములాటలకు కేరాఫ్‌గా మారిన ఆ రెండు పార్టీలపై ప్రజల్లో ఒకింత అసహనం వ్యక్తమవుతున్నది. అధికార పార్టీ ప్రలోభాలతో రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్‌లోకి పెద్ద ఎత్తున చేరికలు జరుగుతున్నప్పటికీ జిల్లాలో మాత్రం ఆ పరిస్థితి లేకుండా పోయింది. చేవెళ్ల లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ హ్యాట్రిక్ కొట్టడం ఖాయమన్న భావన కనిపిస్తున్నది.

## బీఆర్ఎస్ వెన్నంటే జనం..

చేవెళ్ల బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌కు రోజురోజుకూ ప్రజల మద్దతు పెరుగుతున్నది. బీసీ నినాదం సైతం బీఆర్ఎస్‌కు కలిసి వస్తున్నది. బీఆర్ఎస్ నిర్వహిస్తున్న ప్రతి సభ, సమావేశానికి ఊహకందని రీతిలో సబ్బండ వర్గాలు కదిలి వస్తున్నాయి. బీఆర్ఎస్ నుంచి గెలిచి ఇతర పార్టీల్లోకి వెళ్లిన కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రంజిత్ రెడ్డి, బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డిలపై స్థానిక ప్రజానీకం ఆగ్రహంగా ఉన్నది. హామీలను విస్మరించిన కాంగ్రెస్‌పైన, తెలంగాణ పట్ల వివక్ష చూపిన బీజేపీపై గుర్రుగా ఉన్న ప్రజానీకం కారుకే ఓటేస్తామని బహిరంగంగానే చెబుతున్నది.

జనం నుంచి వస్తున్న స్పందనను చూసి గులాబీ దళం కదనోత్సాహంతో ముందుకు సాగుతున్నది. బీఆర్ఎస్‌కు ప్రజల నుంచి లభిస్తున్న స్పందనను చూసి బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు పరేషాన్‌లో పడుతున్నాయి. బీఆర్ఎస్ అభ్యర్థి గెలవడం ఖాయమన్న ధీమాను వివిధ వర్గాలు వ్యక్తం చేస్తున్నాయి.



## ఎన్నికల ప్రచార ప్రకటనలకు..

# ఎంసీఎంసీ అనుమతి తప్పనిసరి

**రంగారెడ్డి కలెక్టర్ శశాంక**

రంగారెడ్డి, ఏప్రిల్ 23 (నమస్తే తెలంగాణ) : ఎంసీఎంసీ అనుమతి లేకుండా ఎన్నికల ప్రచార ప్రకటనలను ప్రచురించకూడదని రిటర్నింగ్ అధికారి, రంగారెడ్డి కలెక్టర్ శశాంక మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల సంఘం నిబంధనల మేరకు మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ (ఎంసీఎంసీ) అనుమతి లేకుండా పోలింగ్ రోజున, పోలింగ్‌కు ఒక రోజు ముందు అంటే.. మే నెల 12, 13 తేదీల్లో ప్రింట్ మీడియాలో ఎలాంటి ఎన్నికల ప్రచార ప్రకటనలను ప్రచురించకూడదన్నారు. ముందస్తుగా ఎంసీఎంసీకి దరఖాస్తు చేసుకుని ధ్రువీకరణ పత్రాలు పొందాలని సూచించారు. లేనిచో ఆర్టికల్ 324 ప్రకారం ఎన్నికల కమిషన్ చర్యలు తీసుకుంటుందన్నారు. ఎన్నికల ప్రక్రియకు విఘాతం కలిగించే రీతిలో ఆవేశపూరితమైన, తప్పుదోవ పట్టించే ప్రకటనలకు అనుమతి ఉండదని కలెక్టర్ స్పష్టం చేశారు.

# కాంగ్రెస్ చేతులెత్తేసింది



నామినేషన్‌లో ర్యాలీలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, చిత్రంలో ఎమ్మెల్యేలు సబితారెడ్డి,కాలె యాదయ్య, ప్రకాశ్‌గౌడ్, బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్, మాజీ ఎమ్మెల్యేలు మహేశ్‌రెడ్డి, రోహిత్‌రెడ్డి, మెతుకు ఆనంద్ తదితరులు

**అర చేతిలో వైకుంఠం చూపి.. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌ను నిలదీయాలి**

**చేవెళ్ల గడ్డపై మరోసారి గులాబీజెండా ఎగురవేద్దాం**

**బడుగుల నేత కాసానిని భారీ మెజార్టీతో గెలిపించుకోవాలి**

**కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులకు బుద్ధి చెప్పాలి**

**దశ.. దిశలేని పార్టీ బీజేపీ, పాలనే చేతకాని పార్టీ కాంగ్రెస్**

**తెలంగాణ అభివృద్ధి బీఆర్ఎస్‌తోనే సాధ్యం**

**చేవెళ్ల పార్లమెంటు అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ నామినేషన్**

**మద్దతుగా ర్యాలీలో పాల్గొన్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**

బండ్లగూడ, ఏప్రిల్ 23 : శ్రీరాముడిని మొక్కుదాం.. బీజేపీని ఓట్లతో తొక్కుదాం అని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కల్వకుంట్ల తారక రామారావు అన్నారు. మంగళవారం రాజేంద్రనగర్‌లో చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గం అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌కు మద్దతుగా నిర్వహించిన నామినేషన్ ర్యాలీలో ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి, ప్రకాశ్‌గౌడ్, కాలె యాదయ్య, అరికెపూడి గాంధీ, ఎమ్మెల్సీ సురభి వాణీదేవితో కలిసి కేటీఆర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా బుద్వేల్ వద్ద వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మాట్లాడుతూ రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ 10 నుంచి 12 పార్లమెంట్ సీట్లను గెలుచుకున్నట్లు అయితే కాంగ్రెస్, బీజేపీ వారు కేసీఆర్ చెంతకు వచ్చి తమకు మద్దతు ఇవ్వాలని బతిమాలుతారని అన్నారు. పదేళ్ల పాలనలో బీజేపీ దేశానికి ఏం చేసిందని, తెలంగాణకు, చేవెళ్లకు ఏం చేశారని ప్రశ్నించారు. చేవెళ్ల నియోజకవర్గానికి నీళ్లు అందించే పాలమూరు ప్రాజెక్టుకు బీజేపీ నేతలు ఎందుకు జాతీయ హోదాను కల్పించలేదని అన్నారు. కేసీఆర్ ఇచ్చిన అవకాశాలను అందిపుచ్చుకుని మంత్రి పదవులలో కొనసాగిన మహేందర్‌రెడ్డి, ఎంపీగా రంజిత్‌రెడ్డి లాంటి వారు పార్టీ కష్టాలలో ఉన్నప్పుడు వదిలి వెళ్లారని మండిపడ్డారు. ఇలాంటి అవకాశవాదులను చిత్తుచిత్తుగా ఓడించాలని పిలుపునిచ్చారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి 200 నుంచి 220 వరకు, కాంగ్రెస్‌కు 150 నుంచి 200 వరకు వస్తాయని అనుకుంటున్నారని, ఆ పార్టీలకు దశ దిశ లేదన్నారు. తెలంగాణలో పాలన చేతకాక కాంగ్రెస్ ప్రభుత్వం అప్పుడే చేతులెత్తేసిందని ఎద్దేవా చేశారు.

## శ్రీరాముడు అందరివాడు

శ్రీరాముడు అందరివాడని ఆయన దేవుడు అని కేటీఆర్ తెలిపారు. రాముడితో ఇబ్బంది లేదు కానీ బీజేపీతోనే ఇబ్బంది అన్నారు. బీజేపీ నేతలు శ్రీరాముడి పేరుతో మత రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. దేశంలో బీజేపీ ఓడినా కూడా శ్రీరాముడికి నష్టం ఏమీ లేదన్నారు. పదేళ్ల క్రితం బీజేపీ అధికారంలోకి వచ్చినప్పుడు క్రూడ్ ఆయిల్ ధరలు వంద డాలర్లు ఉండగా., ఇప్పుడు 84 డాలర్లకు వచ్చిందని తెలిపారు. పెట్రోల్ ధర రూ.70 ఉండగా 110 వరకు పెంచారని తెలిపారు. గ్యాస్ ధర 400 నుంచి 900 పెంచారని గుర్తు చేశారు. క్రూడాయిల్ ధరలు తగ్గినా.. పెట్రోల్, గ్యాస్ ధరలు తగ్గడం లేదని విమర్శించారు. అందుకే రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ నుంచి పార్లమెంట్ ఎన్నికల్లో 12 సీట్లను గెలిపిస్తే కేంద్రంలో చక్రం తిప్పి మనకు అవసరమైన వాటిని పొందవచ్చని తెలిపారు. బడుగు బలహీనవర్గాలకు చెందిన జ్ఞానేశ్వర్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు.

## కాంగ్రెస్ నాయకులను నిలదీయండి

అర చేతిలో వైకుంఠం చూపి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌ను ప్రజలు నిలదీయాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రజల్లోకి వెళ్లి కాంగ్రెస్ ఇచ్చిన మోసపూరితమైన హామీలను వివరించాలన్నారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అధికారంలోకి వచ్చి వంద రోజులైనా నేరవేర్చలేక పోయిందని అన్నారు. పరుగెత్తుకుంటూ వెళ్లి రెండు లక్షలు తెచ్చుకోవాలని పిలుపునిచ్చిన రేవంత్‌రెడ్డి ఇప్పుడేమో రూణ మాఫీకి సమయం కావాలంటూ కొత్త గడువును విధిస్తున్నారని అన్నారు. 111 జీవోను తెలంగాణ ప్రభుత్వం ఎత్తి వేసిందని తద్వారా అనేక మంది రైతులకు ఎంతో మేలు జరిగిందని తెలిపారు.

## చేవెళ్ల పార్లమెంట్ నుంచి మొదటిసారిగా బీసీ నాయకుడు కాసాని

చేవెళ్ల పార్లమెంట్ ఎన్నికల్లో ఇప్పటి వరకు బీసీలకు స్థానం దక్కలేదని కేటీఆర్ అన్నారు. అందుకే కేసీఆర్ బడుగు, బలహీన వర్గాలకు చెందిన బీసీ నాయకుడైన కాసాని జ్ఞానేశ్వర్‌కు పార్లమెంట్ సీటును ఇచ్చి బరిలోకి దింపారని తెలిపారు. ఆయనను భారీ మెజార్టీతో గెలిపించుకోవాల్సిన అవసరం ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీలతో పాటు అందరూ ఏకమై ఓటు వేసి గెలిపించుకుందామని కోరారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గం నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున ర్యాలీలో పాల్గొన్నారు.



నామినేషన్ వేస్తున్న చేవెళ్ల ఎంపీ బీఆర్ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్



రాజేంద్రనగర్‌లో నామినేషన్ వేసేందుకు ర్యాలీగా వెళ్తున్న బీఆర్ఎస్ శ్రేణులు



మాట్లాడుతున్న మహబూబ్‌నగర్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి మన్నె శ్రీనివాస్‌రెడ్డి

# కాంగ్రెస్ అంటేనే కరువు కాలం

- **బీజేపీ దేవుడి పేరుతో రాజకీయం చేస్తున్నది**
- **నీళ్ల దోపిడికి హారతులు పట్టిన అరుణమ్మకు ఓటు వేస్తారా ?**
- **కాంగ్రెస్ పార్టీకి అభ్యర్థులు దొరుకని పరిస్థితి**
- **ఒక్క హామీ కూడా అమలు చేయని సీఎం రైతు రుణమాఫీపై పూటకో మాట**
- **పాలమూరు ప్రజల కష్టాలను తీర్చింది మాజీ సీఎం కేసీఆర్**
- **షాద్‌నగర్ ఎన్నికల ప్రచార సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు**

షాద్‌నగర్, ఏప్రిల్ 23 : కాంగ్రెస్ అంటేనే కరువు.. అధికారంలోకి రావడంతోనే కరువు తాండవిస్తున్నది.. అటువంటి కాంగ్రెస్‌కు ఓటు వేయవద్దని మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థి మన్నె శ్రీనివాస్‌రెడ్డి, మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎమ్మెల్యే వై. అంజయ్యయాదవ్, ఎంపీ ఎన్నికల షాద్‌నగర్ ఇన్‌చార్జి దూదిమెట్ల బాల్‌రాజ్‌యాదవ్ పేర్కొన్నారు. మంగళవారం షాద్‌నగర్ పట్టణంలోని రెడ్ రోస్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన ఎంపీ ఎన్నికల ప్రచార సమావేశంలో వారు మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీకి ఎంపీ ఎన్నికల్లో అభ్యర్థులు దొరుకని పరిస్థితి నెలకొన్నదని ఎద్దేవా చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆగస్టు 15 వరకు పదవిలో ఉంటారా ? లేదా ? అనే విషయం తెలియని పరిస్థితి ఉన్నదన్నారు. ఒక్క హామీని కూడా పూర్తిస్థాయిలో నెరవేర్చని సీఎం రేవంత్‌రెడ్డి ఏక కాలంలో పంట రుణమాఫీ చేస్తామని చెప్పడం హాస్యాస్పదమన్నారు. డబ్బులు పెట్టి పీసీసీ పదవి తెచ్చుకున్నారని అప్పట్లో ఆరోపించిన కోమటి రెడ్డి బ్రదర్స్‌ను మెచ్చుకోవడం చూస్తుంటే సీఎం పరిస్థితి ఎట్ల ఉందో రాష్ట్ర ప్రజలకు అర్థమవుతుందన్నారు. ఏనాడు కూడా పాలమూరు ప్రజల పక్షాన పనిచేయని వంశీచంద్‌రెడ్డికి ఎలా ఓటు వేస్తారని ప్రశ్నించారు. తెలంగాణ జలాలను అక్రమంగా సీమాంధ్రకు దోచుకెళ్తుంటే హారతులు పట్టిన బీజేపీ అభ్యర్థి డీకే అరుణకు పాలమూరు ప్రజలను ఓట్లు అడిగే హక్కు లేదన్నారు. ఓటుకు నోటు కేసులో జైలుకు పోయిన వ్యక్తి సీఎం కావడం మనందరి దురదృష్టమన్నారు. కాంగ్రెస్ మోసాలను ప్రశ్నించాలని, తులం బంగారం ఎక్కడ ? వడ్లకు రూ.500 బోనస్ ఎందుకు ఇవ్వలేదు ? మహిళలకు రూ.2500 ఎమయ్యాయి ? వృద్ధులకు రూ. 4 వేల పింఛన్లు ఎక్కడకు పోయాయి ? రైతు రుణమాఫీ ఎందుకు చేయలేదు ? వంటి అంశాలపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీయాలని కోరారు. ఎన్నో మెడికల్ కళాశాలలు, గురుకుల పాఠశాలలు, సాగు నీటి ప్రాజెక్టులు, పరిశ్రమలను తీసుకొచ్చిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానికే దక్కిందని గుర్తుచేశారు. శ్రీరాముడి పేరుతో బీజేపీ రాజకీయాలు చేస్తున్నది కానీ పేదల కోసం పని చేయలేదని మండిపడ్డారు. ఏడాదికి లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని చెప్పిన బీజేపీ ప్రభుత్వం ఎన్ని ఉద్యోగాలు భర్తీ చేసిందో యువత ఆలోచించాలని కోరారు.

ఈ సమావేశంలో స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థి నవీన్‌కుమార్‌రెడ్డి, జడ్పీ వైస్ చైర్మన్ ఈటె గణేశ్, మున్సిపల్ చైర్మన్ నరేందర్, వైస్ చైర్మన్ ఎంఎస్ నటరాజన్, కేశంపేట ఎంపీపీ వై. రవీందర్‌యాదవ్, మాజీ ఎంపీపీ బెంది శ్రీనివాస్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వంకాయల నారాయణరెడ్డి, నాయకులు బుచ్చిగూడ వెంకట్‌రెడ్డి, రాంభాల్‌నాయక్, రాజావరప్రసాద్, మన్నె నారాయణయాదవ్, సర్వర్‌పాష, ఈగ వెంకట్రాంరెడ్డి, నక్కల వెంకటేశ్‌గౌడ్, రాజ్యలక్ష్మి, రాయికల్ వెంకట్‌రెడ్డి, రబ్బానీ, ఎండీ ఎజాజ్, జీటీ శ్రీనివాస్, బీష్వ రామకృష్ణ, లక్ష్మణ్‌నాయక్, రాఘవేందర్‌రెడ్డి, చంద్రశేఖర్‌గౌడ్, షారుఖ్, కిషోర్, మండల, పట్టణ బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, మహిళా ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్



మాట్లాడుతున్న ఎన్నికల ఇన్‌చార్జి దూదిమెట్ల బాల్‌రాజ్‌యాదవ్

## కాంగ్రెస్‌కు, బీజేపీలకు..

# ఓట్లడిగే హక్కులేదు..

- **ఇబ్రహీంపట్నంలో నియోజకవర్గ సమన్వయ కమిటీ సమావేశంలో బీఆర్ఎస్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి**

ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 23 : తెలంగాణ సాధించడంతో పాటు అభివృద్ధిలో కీలక భూమిక పోషించిన బీఆర్ఎస్ పార్టీకి తప్పా.. కాంగ్రెస్, బీజేపీలకు ఓట్లడిగే నైతిక హక్కులేదని బీఆర్ఎస్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అన్నారు. మంగళవారం బీఆర్ఎస్ భువనగిరి ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేశ్‌తో కలిసి ఇబ్రహీంపట్నంలో నియోజకవర్గ సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంచిరెడ్డి కిషన్‌రెడ్డి మాట్లాడుతూ గత అసెంబ్లీ ఎన్నికల్లో అమలు కానీ హామీలిచ్చి ప్రజలను మభ్యపెట్టి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని, ఆ హామీలు నెరవేర్చడంలో కాంగ్రెస్ పార్టీ విఫలమైందన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో కూడా కాంగ్రెస్‌ను గెలిపించకపోతే హామీలు అమలు కావని, ఆ పార్టీ నాయకులే ఒప్పుకుంటున్నారన్నారు. రాముడి పేరు చెప్పుకుని బీజేపీ లబ్ధిపొందేందుకు ప్రయత్నిస్తుందన్నారు. భువనగిరి పార్లమెంట్ పరిధిలో బీఆర్ఎస్ ప్రభుత్వం యాదాద్రి దేవాలయంను ఆధునీకరించి ప్రపంచ పటంలో నిలిపిందన్నారు. అలాగే, భువనగిరి పార్లమెంట్ పరిధిలో ఉన్న పలు రహదారులను ఆధునీకరించిందని అన్నారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీలకు తగిన గుణపాఠం చెప్పి బీఆర్ఎస్‌ను గెలిపించాలన్నారు.

బీఆర్ఎస్ అభ్యర్థి క్యామ మల్లేశ్ మాట్లాడుతూ భువనగిరి ప్రజలు ఎంతో చైతన్యవంతులని, పోరాట పటిమ కలిగిన వారని అన్నారు. అలాంటి భువనగిరి పార్లమెంట్ పరిధిలో తాను బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్నందున తనను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను గెలిపిస్తే కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చి పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఉన్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో స్థానికుడైన తనను పార్టీలకతీతంగా ఓట్లు వేయాలని కోరారు. మాజీ సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలోనే బడుగు, బలహీన వర్గాలు, బీసీలకు పెద్దపీట వేశారన్నారు. భువనగిరి పార్లమెంట్ స్థానం నుంచి పార్టీ అధినేత కేసీఆర్ తనకు అవకాశం కల్పించారన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు మంచిరెడ్డి ప్రశాంత్‌కుమార్‌రెడ్డి, ఎంపీపీలు కృపేశ్, నర్మద, జడ్పీటీసీ జంగమ్మ, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బుగ్గ రాములు, రమేశ్, రమేశ్‌గౌడ్, కిషన్‌గౌడ్, మున్సిపల్ అధ్యక్షుడు అల్వాల వెంకట్ రెడ్డి, దామోదర్, కల్యాణ్‌నాయక్, జంగయ్య, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు కిషన్‌రెడ్డి